క్లుప్తంగా

పాఠశాలలు తెరచిన రోజే విద్యాకానుక కిట్లు అందజేయాలి



జగనన్న విద్యా కానుక కిట్లు పరిశీలిస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్

పార్వతీపురం టౌన్: పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక కిట్లు అందజేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని డీవీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్లు, పాఠ్యపుస్తకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నాటికి పుస్తకాలతో పాటు సామగ్రి సక్రమంగా ఉండాలని సూచించారు. పుస్తకాల పంపిణీలో ఎటువంటి అలసత్వం లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రేమ్‌కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలో సీతంపేట గ్రామ సచివాలయం – 1 ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం పదో తరగతి చదివి ఉండాలన్నారు. ఇంటర్మీడియెట్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. జూన్ 2వ తేదీలోగా అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పేదలకు బియ్యం, చీరల పంపిణీ



బియ్యం, చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: స్థానిక పీఎంఆర్‌సీ సెంటర్‌కు సమీపంలో పేదలకు పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేతుల మీదుగా శుక్రవారం బియ్యం, చీరలు పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

సవర భాషపై వేసవి శిక్షణ తరగతులు



సవర భాష కృత్యాలు చేస్తున్న ఆదివాసీ విద్యార్థులు

భామిని: మండలంలోని సతివాడ సమీపంలో అక్షరబ్రహ్మ ఆశ్రమంలో ఆదివాసీ పిల్లలకు సవర భాష శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నూకాలమ్మగూడలోని అక్షరబ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘం జిల్లా కో ఆర్డినేటర్ సవర కరువయ్య పర్యవేక్షణలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. సవర భాషపై వివిధ తరగతుల విద్యార్థులకు సవర లిపిపై పట్టు సాధించేలా సాధన చేయించారు. సవర భాషలో పదాలు, గుణింతాలు, కథలు, వాక్యాలు రాసే విధానాన్ని వివరించారు. పదాలకు తగిన విధంగా చిన్నారులకు కృత్యాలు చేయించారు. సవర భాషలో కథలు చెప్పించారు. ఆటలు ఆడించారు. ఆశ్రమం కంప్యూటర్ ఆపరేటర్ సవర గంగారాం, అక్షర బ్రహ్మ ప్రచారకులు, ఆదివాసీ విద్యార్థులు పాల్గొన్నారు.

గురండిలో దేవుడి పెళ్లి



చంద్రశేఖరస్వామిని ఊరేగిస్తున్న గురండి గ్రామస్తులు

భామిని: మండలంలోని గురండి గ్రామంలో వెలసిన శ్రీచంద్రశేఖర స్వామి కల్యాణం, చక్ర తీర్థ స్నానాలు శుక్రవారం సందడిగా నిర్వహించారు. గురండిలో వెలసిన పురాతన ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కల్యాణ మండపంపై దేవుని పెళ్లిగా పిలిచే చంద్రశేఖరస్వామి, దుర్గాదేవీల కల్యాణం ఉత్కళ సాంప్రదాయంలో చేపట్టారు. అనంతరం పల్లకిలో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నేరడి బీ వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు చేయించారు. ఒడిశా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

సారా పట్టివేత

పాలకొండ రూరల్: మండలంలోని అవలంగి గ్రామ సమీపంలో 10 లీటర్ల సారా తరలిస్తున్న బొమ్మాళి రాయప్పను శుక్రవారం పాలకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద ఉన్న సారాను సీజ్ చేయటంతో పాటు నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ బి.శివప్రసాద్ తెలిపారు.

వలంటీర్లే సంక్షేమ వారధులు

- ఎమ్మెల్యే జోగారావు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



నూకలవాడలో వలంటీర్లకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: అట్టడుగు, బడుగు, బలహీన వర్గాలు, అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లే వారధులని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని నూకలవాడలో 12సచివాలయాలకు చెందిన వలంటీర్లను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జవాబుదారీ తనంగా ఉండాలనే సంకల్పంతో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటుచేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు వలంటీర్లు ఎంతో కృషిచేస్తున్నారని ప్రశంసించారు. సుస్థిర ప్రభుత్వ విధానాలను మొట్టమొదటిగా మన రాష్ట్రంలోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ఏ ఒక్కరైనా సంక్షేమ పథకం అందలేదని అడిగితే అందుకు వలంటీర్లే కారకులవుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఝాన్సీ, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, కె.వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి నిదర్శనం నూకలవాడ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మారుమూల గ్రామాలలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. అందుకు నూకలవాడ గ్రామంలో నిర్మించిన భవనాలే ఉదాహరణగా చెప్పుకోవచ్చన్నారు. మండలంలోని నూకలవాడలో నిర్మాణాలు పూర్తయిన సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, రోడ్డును ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ ఝాన్సీ ఆధ్వర్యంలో రూ.2.19కోట్లతో నిర్మించిన వాటిని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం ఏర్పాటైన నాటి నుంచి సరైన రహదారి సదుపాయం లేకపోవడంతో ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని వారి కల నేటితో తీరిందన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాదని అటువంటి ప్రభుత్వానికి అందరు అండగా ఉండాలని కోరారు. నూతన భవనాలు, రోడ్డు ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా నూకలవాడ గ్రామస్తులు ఎమ్మెల్యే జోగారావుకు ఘనంగా, వైవిధ్య భరితంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే జోగారావును పల్లకిలో కూర్చోబెట్టి, కిలోమీటరుకు పైగా గ్రామస్తులే స్వయంగా మోసి సభావేదిక వద్దకు తీసుకువెళ్లారు.



ఎమ్మెల్యే జోగారావును పల్లకిలో ఊరేగిస్తున్న గ్రామస్తులు

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



మాట్లాడుతున్న రాజన్నదొర

మెంటాడ: సాలూరు నియోజకవర్గంలో గడిచిన నాలుగేళ్లలో రూ.800 కోట్లతో అభివృద్ధి, మరో రూ.800కోట్లతో సంక్షేమం ప్రజలకు అందిస్తే టీడీపీ నాయకులకు కనబడకపోవడం శోచనీయంగా ఉందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పోరాం గ్రామంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. ఏ ప్రాంతానికి రమ్మన్న తాను వస్తానని చెప్పారు. సాలూరు నియోజకవర్గంలో టీడీపీ నిర్వహించిన మహానాడులో సంధ్యారాణి తనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. రాజన్నదొరను తప్పుపడితే ఊరుకునేది లేదన్నారు. ఇంతవరకూ సంధ్యారాణి ఒక గిరిజన ఆడబిడ్డగా చూసి ఏరోజు ఒక్క మాట కూడా తాను వ్యక్తిగతంగా దూషణ చేయలేదన్నారు. తనను, తన ప్రభుత్వాన్ని దూషణ చేస్తే ఇకపై సంధ్యారాణిపై కూడా విరుచుకుపడటం ఖాయమన్నారు. ఆరేళ్ల ఎమ్మెల్సీలుగా ఉన్న ద్వారపురెడ్డి జగదీష్, గుమ్మడి సంధ్యారాణి ఒక్క గిరిజన గ్రామంలోనైనా రోడ్డు వేయించారా... అని ప్రశ్నించారు. అదే నాలుగేళ్లలో తమ ప్రభుత్వ హయాంలో అన్ని గిరిజన గ్రామాల్లో రోడ్లు తాగునీరు, మౌలిక వసతులు కల్పించామన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అసలైన వారసుడు జూనియర్ ఎన్టీఆర్ అని అన్నారు. చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో ఆయనతో పాటు జెడ్పీటీసీ లెంక సన్యాసప్పలనాయుడు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, నాయుడుబాబు, బాయి అప్పారావు ఉన్నారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

పార్వతీపురం టౌన్: మున్సిపల్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుచ గౌరీశ్వరి అధ్యక్షతన నిర్వహిస్తామని కౌన్సిల్ సభ్యులతా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

సేవారత్నకు సత్కారం

సాలూరు: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన వలంటీర్లకు వందనం పురస్కారాల్లో సేవారత్న అవార్డుకు ఎంపికైన 26వ వార్డు వలంటీరు నులకల హేమభూషణ్‌ను స్థానిక కౌన్సిలర్ పాండ్రంకి సన్యాసమ్మ, నాయకులు కర్రి అప్పలస్వామి తదితరులు అభినందించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సచివాలయంలో సచివాలయ ఉద్యోగులతో కలిసి హేమభూషణ్‌ను సత్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సేవాభావంతో వలంటీర్లు పనిచేస్తున్నారని కౌన్సిలర్ ప్రశంసించారు.



వలంటీరు నులకల హేమభూషణ్‌ను అభినందిస్తున్న కౌన్సిలర్ పాండ్రంకి సన్యాసమ్మ, తదితరులు

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శిరీష

సీతానగరం: ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ దారా గ్రామాల్లో రోగులకు 104 సంచార వేద్య కేంద్రం ఆవరణలో మెరుగైన వైద్య సేవలు అందించగలుగుతున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శిరీష అన్నారు. ఈ మేరకు సీతానగరం పీహెచ్‌సీ పరిధిలోని అప్పయ్యపేటలో 104 సంచార వైద్యారోగ్యకేంద్రం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంలో శుక్రవారం ఉచితవైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో 104 సంచార వైద్య కేంద్రంలో సిబ్బంది సహకారంతో రోగనిర్ధారణ, వ్యాధి నివారణకు అవసరమైన మందులు 104 వాహనంలోనే పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆరోగ్యశ్రీ విధానం ద్వారా వ్యాధి తగ్గుముఖం పట్టి తిరిగి ఆరోగ్యవంతంగా ఇంటికి చేరుకున్న వ్యాధిగ్రస్తులకు స్థానికంగా మందులు అందజేస్తున్నట్లు వివరించారు. వైద్యశిబిరంలో 68 మందికి వైద్యసేవలు అందించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బి సూర్యనారాయణ, గౌరునాయుడు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి మూడు నూతన పాఠశాలలు

- మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు, ప్రజలు



ప్రభుత్వం పాఠశాలల మంజూరు పత్రాలను చూపిస్తున్న నాయకులు

సాలూరు: నియోజకవర్గంలోని సాలూరు మండలం కొత్తవలస పంచాయతీ కేంద్రం, తోణాం పంచాయతీ మెట్టవలస, మక్కువ మండలం దబ్బగెడ్డవలస గ్రామాలకు మూడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని తోణాంలో సర్పంచ్ మువ్వల ఆదయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ, తమ పాఠశాల సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తోణాం, కొత్తవలసలలో దశాబ్దాల కాలంగా ఆర్సీఎం ఎయిడెడ్ పాఠశాలలు ఉండేవని, అవి ఇటీవల మూతపడడంతో విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చి తీవ్ర ఇబ్బందులు పడేవారని పేర్కొన్నారు. ఈ క్రమంలో విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖామంత్రి, అధికారులకు తెలియజేయగా కొద్ది రోజుల్లోనే సమస్య పరిష్కరించి నూతన పాఠశాలలను మంజూరుచేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ మంజూరు పత్రాల ప్రతులను అందరికీ చూపించారు. నియోజకవర్గానికి మూడు మండల పరిషత్ పాఠశాలలు మంజూరుచేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఎంఈఓ రాజశేఖర్ స్పష్టం చేశారు.

బాధిత కుటుంబానికి అండగా 'రెడ్‌క్రాస్'



బాధిత కుటుంబ సభ్యులకు సరుకులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

కురుపాం: బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. కురుపాం మండల కేంద్రంలోని మంతినివలస కాలనీలో నివాసముంటున్న బచ్చల మోహన్‌రావు ఇల్లు మూడు రోజుల కిందట షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు, కార్యదర్శి బి.నాగభూషణరావు, జిల్లా కో ఆర్డినేటర్ వై.జనార్దనరావు బాధిత కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి శుక్రవారం వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, టార్పాలిన్ తదితర వినియోగ వస్తువులను అందజేశారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, స్థానిక వర్తక సంఘం నాయకులు బరాటం గుంపస్వామేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట వెంకట సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రపతిని పిలవకపోవడం శోచనీయం



గుమ్మలక్ష్మీపురంలో కాంగ్రెస్ పార్టీ నిరసన

గుమ్మలక్ష్మీపురం: పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఆహ్వానించకపోవడం బాధకరమని కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా నాయకుడు నిమ్మక సింహాచలం అన్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పిలుపు మేరకు శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ రాష్ట్రపతిగా ఉన్న గిరిజన మహిళను పార్లమెంట్ నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మోదీ ప్రభుత్వం పిలవకపోవడం చూస్తుంటే బీజేపీ కుల రాజకీయాన్ని ఎంతగా ప్రోత్సాహిస్తుందో అర్థమవుతుందన్నారు. గిరిజనుల ఓట్ల కోసమే ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిగా నియమించారనేందుకు ఈ సంఘటనే నిదర్శనమన్నారు. కుల రాజకీయాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ, గిరిజనులను అణచివేసేలా వ్యవహరిస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీకి రాష్ట్ర ప్రజలంతా బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.లక్ష్మణరావు, ఎస్.కృష్ణ, దుడ్డుఖల్లు సర్పంచ్ ఎస్.నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో అర్హులకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల అమలులో భాగంగా ప్రతికుటుంబంలో అర్హులకు ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇళ్లులేని పేదలకు ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు సమకూరుస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదభోగిలి గ్రామంలో ఎంపీటీసీలు సురగాల గౌరి, బి.కుసుమ, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.కూర్మారావు ఇజ్జాడ సింహాచలం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జోగారావుకు ప్రజలు కుంకుమ దిద్ది హారతులతో స్వాగతం పలికి దీవెనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదభోగిలి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను గ్రామాలకు పంపించారన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకుని ఎవరికైనా అర్హత ఉండి ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలు అందకుంటే వివరాలు అడిగి తెలుసుకుని అధికారుల సమక్షంలో సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా గూలకులస్థులు, విశ్వ బ్రాహ్మణ, ఎస్సీకుటుంబాల వారు ఇంటిస్థలాలు మంజూరు చేయాలని, రహదారి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరడంతో నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎంగా సేవలందించడానికి ఆశీర్వదించి దీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్, వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు, ఏపీఓ భాను, విద్యుత్ శాఖ ఏఈ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, మండల పార్టీ నాయకులు పి.ఈశ్వరనారాయణ, ఆర్వీ పార్థసారథి, పి.పైడిపినాయుడు, ఎం వెంకటరమణ, అప్పారావు, ఇజ్జాడ లక్ష్మణరావు, కిరణ్‌కుమార్, దేవదానం,యు సురేష్, రమేష్ పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంక్‌కు భూమిపూజ

రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని పణుకుపేటలో రక్షితమంచినీటి పథకం ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సామాజిక పరమైన అభివృద్ధి పనులు చేపట్టడానికి అవసరమైన నిధులు వివిధ పథకాల ద్వారా మంజూరుచేస్తోందని తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించే సమయంలో ప్రజలు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరడం వల్ల రూ. 20 లక్షల వ్యయంతో 20 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బంకురు పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, ఉపసర్పంచ్ డి.కృష్ణమూర్తి, స్థానిక నాయకులు శ్రీహరినాయుడు, మాజీ సర్పంచ్‌లు బి.శ్రీనివాసరావు, రాజమణి, డీసీఎంఎస్ జిల్లా డైరెక్టర్ జె. శ్రీకాంత్, లక్ష్మణస్వామి తదితర నాయకులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు విధిగా తీసుకోవాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. దీంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. మండలంలోని పెద్దూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ఆహార పదార్థాలను మెనూ ప్రకారం గర్భిణులకు, బాలింతలకు పెట్టాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతీ రోజు గుడ్డు, పాలు, ఆకు కూరలు, కాయగూరలతో భోజనం అందించడం జరుగుతుందన్నారు. నిర్దేశించిన మెనూను అమలు చేయకపోతే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఆమె వెంట ఈఓపీఆర్‌డీ గోపాలరావు ఉన్నారు.

మలేరియాకు చెక్ పెడదాం..



టిక్కబాయి అంగన్‌వాడీ కేంద్రంలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మలేరియా వ్యాధిని కలుగజేసే దోమల నివారణకు చేపడుతున్న ఏసీఎం 5 శాతం మందును ప్రతీ ఇంట్లో పిచికారీ చేయించుకోవాలని, తద్వారా మలేరియాకు అడ్డుకట్ట వేద్దామని గుమ్మలక్ష్మీపురం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు అన్నారు. దోమల నివారణకు మొదటి విడత పిచికారీ పనులను మండలంలోని తాడికొండ పీహెచ్‌సీ పరిధిలోని టిక్కబాయి గ్రామంలోని గృహాలతో పాటు, గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతీ ఏటా మలేరియా మందును గ్రామాల్లో పిచికారీ చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరూ ఇంటా, బయట, ఆవరణల్లో ఈ మందును పిచికారీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీను, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.శాంతి, వైద్య సిబ్బంది నిమ్మకూరి రత్నప్రసాద్, కాంచన పాల్గొన్నారు.

మూడు చక్రాల వాహనాల పంపిణీ



లబ్ధిదారులకు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు మూడు చక్రాల వాహనాలను కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చినమేరంగిలోని తన నివాసంలో శుక్రవారం అందజేశారు. పది మంది లబ్ధిదారులకు రిట్రోఫిటెడ్ మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనములు అందజేశారు. ఈ సందర్భంగా పుష్పశ్రీవాణి మాట్లాడుతూ శారీరక అంగవైకల్యం కలిగిన వారికి మోటార్ వాహనాలు పొందడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.